

# అనుకోని కథ

– రాధిక మంగిపూడి



జరిగిన కథ

ప్రస్తుత కథలో యాక్సిడెంట్ సమయంలో తనకు సహాయం చేసిన మధురను సత్యనారాయణ తన ఇంటికి రమ్మని ఆహ్వానిస్తాడు. మాటల్లో అతను తన అభిమాన హీరో అభిరామ్ తండ్రి అని మధురకు అర్థమవుతుంది. అతని ఆహ్వానం మేరకు ఆ ఇంటికి వెళ్లిన మధుర కళ్ళు ఆశగా అభిరామ్ కోసం వెతుకుతాయి.

గతకాలపు కథలో సౌదామిని అనే వీరవనిత దక్షిణకోనలో పెళ్లి బృందాన్ని దోచుకోవడానికి వచ్చిన దుండగలపై విరుచుకుపడి పోరాడుతుంది. కొందరిని హతమార్చగా కొందరు పారిపోతారు. ఇదంతా బండ చాటు నుండి గమనిస్తున్న కేతు పెళ్లివారు వెళ్ళిపోగానే శవాలన్నింటికీ మాయం చేస్తాడు.

## అభిరామ్

ఆ రోజైనా అభిరామ్ ను చూడగలదో లేదో అనే ఆత్రుతతో అడిగిన మధురకు సమాధానంగా “ఏమోనమ్మా! వాడు ఎప్పుడు ఊరిమీద ఉంటాడో, ఎప్పుడు ఇంట్లో ఉంటాడో నాకు ఏమన్నా చెప్తేగా నాకు తెలియడానికి! మధ్యాహ్నం భోజనాల సమయంలో చెప్పాను ‘సాయంత్రం ఒక అమ్మాయి మన ఇంటికి వస్తోంది. తనే నిన్న ఆక్సిడెంట్ సమయంలో నాకు సహాయం చేసింది. సాయంత్రం ఇంట్లో ఉండు.’ అని. ‘కుదరదు. తనకేదో పార్టీ ఉంది. బయటకు వెళ్లాలి’ అన్నాడు. ఇప్పుడు మేడ మీద తన గదిలో ఉన్నాడో లేక నేను మధ్యాహ్నం నిద్రపోయి లేచే ముందే బయటకు వెళ్ళిపోయాడో తెలియదు మరి.” అన్నాడు సత్యనారాయణ రోజూ ఇది వారికి మామూలే అన్నట్లు.

ఒక్కసారిగా మధుర గుండె జారి నీరైపోయింది. ఈసారి కూడా అభిరామ్ ను కళ్ళారా చూడలేదన్నమాట. మారు మాట్లాడలేకపోయింది. తల కిందకు వాలిపోయింది. మరుక్షణం అభిరామ్ మేడ మెట్లు దిగి హాల్లోకి వస్తూ కనిపించాడు.

వస్తూనే నేరుగా తండ్రి వైపు చూస్తూ “నాన్నా! నేను బయటకు వెళ్తున్నాను. వచ్చేసరికి రాత్రి లేట్ అవుతుంది. నాకోసం చూడవద్దు.!” అని చెప్పి తిన్నగా బయటకు నడవబోయాడు.

మధుర గుండె క్షణకాలం పాటు కొట్టుకోవడం ఆగిపోయింది. కళ్ళు పెద్దవి చేసుకొని మరీ అభిరామ్ వైపు తదేకంగా చూస్తోంది. కలో నిజమో ఆమె అర్థం చేసుకునే పరిస్థితిలో కూడా లేదు. అతడు చెప్పాల్సింది చెప్పి తన తండ్రి వైపు నుండి వీధిద్వారం వైపు చూపు తిప్పుకునే మధ్యలో త్రుటి కాలం మధుర వంక చూశాడు. అతని అడుగు ముందుకు

పడబోతుండగా అకస్మాత్తుగా ఆగిపోయింది. మళ్ళీ వెంటనే తల వెనక్కి తిప్పి ఆమెను చూశాడు. మధుర రెప్ప వాల్చకుండా తననే చూస్తోంది. అప్రయత్నంగా లేచి నిలబడింది. అభిరామ్ చూపు అమెనుండి మరలలేదు. ఆమెనే నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడిపోయాడు. పెద్ద కళ్ళు, పొడవైన జడ, చక్కటి బొట్టు, బంగారు ఛాయ, తీరైన బాపు బొమ్మలా ఉండే మధురను కొద్ది క్షణాలు చూస్తూ ఉండిపోయాడు.

తనే ముందు తేరుకొని, ఆమెను ఇదివరకే చూసి పోల్చుకున్నట్లు కొద్దిగా ఆశ్చర్యంతో కూడిన చిరునవ్వుతో "మీరా!..." అంటూ పలకరించబోయి ఆగిపోయాడు.

ఇద్దరినీ గమనించిన సత్యనారాయణ చిన్నగా నవ్వుకుంటూ లేచి నిలబడి కొడుకుతో "ఈ అమ్మాయి పేరు మధుర. ఆర్కిటెక్చర్లో పీ.జీ చేస్తోంది. నిన్న రాత్రి నాకు సమయానికి సాయం చేసిన అమ్మాయి అని చెప్పాను కదా! నీకు తను ముందే తెలుసా?" అని అడిగాడు.

మధురకు కాళ్లు కొద్దిగా వణుకుతున్నాయి. అరిచేతుల్లో చెమటలు పడుతున్నాయి. గొంతు తడారిపోతోంది. మాట పెగలట్లేదు. అతి కష్టం మీద "హాయ్!" అంది.

అభిరామ్ కాస్త స్థిమితపడి, తడబడుతూనే "హాయ్ మధురా! మీరు నాన్నగారికి సాయం చేసినందుకు చాలా థాంక్స్! మీరు నాకు తెలియదు. కానీ ఇదివరకు మిమ్మల్ని ఒకసారి చూసినట్లు గుర్తు!" అన్నాడు నెమ్మదిగా. నిర్ఘాంతపోయింది మధుర.

సత్యనారాయణ వెంటనే "ఓహ్ అలాగా! సరే! ఏదో పార్టీకి వెళ్లాలన్నావుగా! వెళ్ళు!" అన్నాడు ఏదో గుర్తు చేస్తున్నట్లు.

"ఫరవాలేదు నాన్నా! ఇంకా టైం ఉంది. కాసేపు ఆగి వెళ్తాను." అన్నాడు అభిరామ్ వాచీ వంక చూస్తూ.

"సార్! టీ తెమ్మంటారా?" అడిగింది లక్ష్మి.

"పదండి. లోపల డైనింగ్ టేబుల్ దగ్గరికి వెళ్లి కబుర్లు చెప్పుకుంటూ టీ తాగుదాం!" అన్నాడు సత్యనారాయణ.

అభిరామ్ చేతిలో ఉన్న హూడీ జాకెట్, మాస్క్ అక్కడే పడేసి లోపలికి నడిచాడు. మధుర వారిద్దరినీ మౌనంగా అనుసరించింది.

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంటూనే "అయితే మధురను ఇంతకుముందు ఎక్కడ కలిశావు?" మళ్ళీ అడిగాడు సత్యనారాయణ కొడుకును ఆరా తీస్తూ.

అభిరామ్ కాస్త తడబడుతూ "కలవలేదు. చూశాను అంతే." అన్నాడు మళ్ళీ.

"అదే.. ఎక్కడ? ఎప్పుడు? ఎలా? అని అడుగుతున్నాను." ఈసారి రెట్టించి మరీ అడిగాడు సత్యనారాయణ.

మధురకు టెన్షన్ తారస్థాయిలో ఉంది. అభిరామ్ అసలు తనని చూడడమేమిటి? తిరిగి పోల్చుకోవడమేమిటి? అబద్ధమాడుతున్నాడా? రకరకాల ఆలోచనలు... ఏదేమైనా చేయి చాచితే తాకే దూరంలో అతను కూర్చొని ఉన్నాడు. నమ్మలేకపోతోంది. ఒకపక్క ఎగిరి గంతేయాలని ఉంది. ఇంకో పక్క ఏదో తెలియని భయం, బెరుకు.

అభిరామ్ ఏదో ఆలోచించి గుర్తుతెచ్చుకున్నట్లు ఒక్క క్షణం పైకి చూసి “పోయిన వారం షూటింగ్ నుంచి వస్తూ నా ప్రొడక్షన్ మేనేజర్ కొడుకిది బర్తడే అంటే గిఫ్ట్ కొనడానికి మెయిన్ రోడ్ లో కొత్తగా పెట్టిన మాల్ దగ్గర ఆగాను. అక్కడ చూశాను అనుకుంటా.” అన్నాడు చాలా యధాలాపంగా చెప్తున్నట్లు కనిపించే ప్రయత్నం చేస్తూ.

సత్యనారాయణ “ఓహో అలాగా!” అంటూ సన్నగా తనలో తానే నవ్వుకున్నాడు.

మధుర ఒక్కసారి ఉలిక్కిపడి “ఆరోజు మాల్ లో మీరు నన్ను చూశారా? నేను చూసేసరికే మీరు కారు ఎక్కి వెళ్ళిపోయారు.” అంది గొంతులో నిరుత్సాహాన్ని దాచలేక.

అభిరామ్ ఆమె వంక కాస్త జాలిగా చూస్తూ “ఆరోజు మీరెవరి కోసమో ఆత్రంగా వెతుకుతున్నట్టు ఉన్నారు. మెట్ల వైపుకు పరిగెడుతూ కనిపించారు. నేను ఆ సమయానికి లిఫ్ట్ లో ఉన్నాను. లిఫ్ట్ గ్లాస్ తలుపుల నుండి మిమ్మల్ని చూశాను. తర్వాత నేను కారు దగ్గరికి వెళ్ళిపోయాక మీరు మళ్ళీ కనిపించలేదు.” అన్నాడు అసలు విషయం చెప్తూ. మధురకు ఒక్క క్షణం ఏమనాలో పాలుపోలేదు.

లక్ష్మి అందరికీ అందమైన కప్పులలో టీ, గాజు ప్లేట్లలో వేడి వేడి పకోడీలు, సమోసాలు తెచ్చి టేబుల్ పైన పెట్టింది.

“అయితే అంతమందిలో మధురను మాత్రం చూసి గుర్తు పెట్టుకున్నావన్నమాట.” అన్నాడు సత్యనారాయణ టీ అందుకుంటూ.

“అంటే... ఆరోజు తను ఏదో టెన్షన్ గా, దిగులుగా కనిపించింది. పాపం అమ్మాయి కదా! ఏమైందో అనుకున్నాను. అందుకే గుర్తుంది.” అనేశాడు అభిరామ్ సంజాయిషీ ఇస్తున్నట్లు.

“ఇంతకూ నువ్వెందుకు అప్పుడు దిగులుగా ఉన్నావు? ఆరోజు ఎవరిని వెతుకుతున్నావు?” ఈసారి మధురవైపు సూటిగా చూసి అడిగాడు సత్యనారాయణ.

మధుర తడబడుతూ “ఆరోజు అభిరామ్ మాల్ కు వచ్చారన్న విషయం తెలియగానే మా ఫ్రెండ్స్ అందరూ ఉన్నట్టుండి నన్ను ఒంటరిగా వదిలేసి పరిగెట్టారు. వాళ్ళనే వెతుకుతున్నాను.” అంది అంతకన్నా ఏం చెప్పాలో తోచక. అభిరామ్ ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ చిన్నగా నవ్వాడు. మధుర తలదించుకుంది.

టీ తాగుతూ సమోసాలు తింటూ కాసేపు సరదాగా మాట్లాడుకుంటున్నారు ముగ్గురూ. ఏదో కొత్తవారి దగ్గరకు వచ్చినట్లు అస్సలు లేదు మధురకు. ఎప్పటినుండో తెలిసిన దగ్గర బంధువుల ఇంటికి వచ్చినట్లు ఉంది ఆమెకు. అభిరామ్ మంచి సరదా అయిన మనిషి. చలాకీగా జోకులేస్తూ సరదాగా మాట్లాడుతున్నాడు. తీరైన రూపం. ఆకర్షణీయమైన నవ్వు.

కళ్ళు తిప్పుకోలేకపోతోంది మధుర. ఒకపక్క అవధులు లేని సంతోషం, ఇంకోపక్క ఈ అందమైన కల ఎక్కడ ఒక్కసారిగా చెదిరిపోతుందోనన్న భయం.. రెండూ సమపాళ్లలో ఆవహించాయి ఆమె మనసును.

మాటల మధ్యలో "అయితే మధురా! నీకు ఆర్కిటెక్చర్ తో పాటు ఇంకేంటి ఇష్టం? ఖాళీ సమయాల్లో ఏం చేస్తూ ఉంటావు? అని అడిగాడు సత్యనారాయణ.

"నాకు ముఖ్యంగా ఏన్షియంట్ ఆర్కిటెక్చర్ ఎక్కువ ఇష్టం. కనుక దానితోపాటు హిస్టరీ, ఆర్కియాలజీ, ఇండియన్ ఫిలాసఫీ, సైకాలజీకి సంబంధించిన పుస్తకాలను కూడా తీరిక సమయాల్లో ఎక్కువగా చదువుతూ ఉంటాను." అంది మధుర తడుముకోకుండా.

"అమ్మో! అన్నీ కష్టమైన సబ్జెక్టులే! అందరికీ కొరకబడేవి కావు. నువ్వు చాలా తెలివైనదానివి. మేము నీ దగ్గర జాగ్రత్తగా ఉండాలి." అంటూ నవ్వాడు సత్యనారాయణ.

ఉన్నట్లుండి అభిరామ్ "అయితే మధురా! సైకాలజీలో నాకు ఒక సందేహం ఉంది. తీర్చగలవా?" అని అడిగాడు ఏకవచనంతో సంభోదిస్తూ.

"సందేహాలు తీర్చే అంత పరిజ్ఞానం నాకు లేదేమో! నేను ఇంకా విద్యార్థినే! కానీ అడగండి సార్! నాకు తెలిసింది చెప్పే ప్రయత్నం తప్పకుండా చేస్తాను." అంది మధుర ఉత్సాహంగా.

"అయితే ముందు నాకు ఒక ఫేవర్ చెయ్యి. 'సార్' అని పిలవడం ఆపేసి, నన్ను పేరు పెట్టి 'అభీ!' అని పిలువు. ఇప్పుడు ఇద్దరూ ఫ్రెండ్స్ అయిపోయాం కదా!" అన్నాడు చనువుగా.

"అలాగే" అంది మధుర  మరింత  ఆశ్చర్యంతో కూడిన ఆనందంతో.

**రాజతంత్రం**

అది ఉజ్జయిని కోటలోని శూరసేన మహారాజు అంతరంగిక మందిరం. "అభివాదాలు మహాప్రభో! రమ్మన్నారుట!" రాజుకు వంగి నమస్కరిస్తూ అన్నాడు మాళవ రాజ్య మంత్రి ప్రచండుడు.

"రండి మంత్రివర్యా! కొన్ని అత్యవసర పరిస్థితుల గురించి మీతో చర్చించవలసివచ్చి మిమ్మల్ని ఈ సమయంలో పిలిపించాల్సివచ్చింది." దిగులు ప్రతిధ్వనిస్తున్న స్వరంతో అన్నాడు మాళవ మహారాజు శూరసేనుడు.

వారు మాట్లాడుతూ ఉండగానే లోనికి అడుగుపెట్టాడు రాజుగురువు ఆనందవర్ధనుడు. నెరిసిన శిరోజాలు, నిశితమైన కన్నులు, తేజవవంతమైన ముఖవర్చస్సుతో ఉన్న రాజుగురువును చూడగానే మహారాజు, మంత్రి ఇద్దరూ అతనికి ఎదురేగి శిరస్సు వంచి నమస్కరించారు.

"విజయోస్తు!" అని దీవించాడు ఆనందవర్ధనుడు.

శూరసేన మహారాజు మాళవ రాజ్య ప్రజల ప్రేమాభిమానాలు చూరగొన్న రాజు. ప్రజలను కన్న బిడ్డల వలే పాలిస్తూ అందరికీ అందుబాటులో ఉంటూ సరిహద్దు రాజ్యాల రాజులందరితోనూ సామరస్యంగా మెలుగుతూ ఉంటాడు. కొన్ని సంవత్సరాల క్రితం మహారాణి అనారోగ్యం పాలై ఆకస్మాత్తుగా మరణించింది. ఆమెపైనున్న అపారమైన ప్రేమతో రాజు మరల వివాహం చేసుకోలేదు. శూరసేనుడు సరైన రాజుతంత్రం తెలిసిన రాజే. కానీ పిల్లలు లేని కారణంగా తన తర్వాత రాజ్యం ఏమైపోతుందనే దిగులుతో అతని ముఖంలో వయసుకు మించిన వృద్ధాప్యాన్ని కొనితెచ్చుకున్నాడు.

"దిగులుగా ఉన్నావేమి శూరసేనా? ఏం జరిగింది? ఈ అర్ధరాత్రి సమయంలో ఈ ఆంతరంగిక సమావేశాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరం ఏం పడింది?" సూటిగా ప్రశ్నించాడు రాజుగురువు.

"ఆచార్యా! అసలు మాకే ఎందుకిలా జరుగుతోంది? ఒకపక్క సంతానం లేక ఈ రాజ్యానికి ఉత్తరాధికారిని ఎన్నుకోలేని పరిస్థితుల్లో ఉన్న నాకు మరికొన్ని కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. ఏనాడూ లేనిది రాజ్యంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లే సంఘటనలు వరుసగా జరుగుతున్నాయి. కుట్రదారులెవరో తెలియటం లేదు. ఇందాకే నా అంతరంగిక వేగులు కొన్ని వార్తలను తీసుకువచ్చారు. వెంటనే మిమ్మల్ని ఇద్దరినీ పిలిపించాను. ఒకసారి మీరు కూడా వేగులు చెప్పే విషయాలను విని కర్తవ్యాన్ని సూచించండి." అన్నాడు శూరసేనుడు.

మంత్రి ప్రచండుడు వెంటనే "అయ్యో! ఇదేమి దుస్థితి మహారాజా! మీరు బాధపడకండి. ఎటువంటి పరిస్థితి అయినా వెంటనే మనం తగిన చర్యలు తీసుకుందాం!" అన్నాడు ఆదుర్దాగా.

ఆనందవర్ధనుడు ఒక్క క్షణం మంత్రి ముఖం వంక నిశితంగా చూశాడు. మరల రాజు వైపుకు తిరిగి "రాజా! నీకు ఇంతటి నిరుత్సాహం తగదు. అన్నింటికీ ఆ పరమేశ్వరుడే ఉన్నాడు. రాజతంత్రం తెలిసినవాడివి. రాజన్నవాడు ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోవడానికి ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలి. నీవే ఇలా దిగులు పడిపోతే ఎలా? వేగులను రప్పించు!" అన్నాడు శూరసేనుని శాంతపరుస్తూ.

"అన్ని సమస్యలూ ఒకేసారి వచ్చిపడితే ఏమి చేయాలో తెలియడం లేదు ఆచార్యా! అన్నింటికి మీరున్నారనే నా ధైర్యం." అంటూ రాజు వేగులను లోనికి పంపమని ద్వారపాలకునికి ఆజ్ఞ ఇచ్చాడు.

మారువేషంలో ఉన్న నలుగురు వేగులు లోనికి వచ్చి వారికి నమస్కరించారు. ద్వారపాలకుడు బయటకు వెళ్లి తలుపులు మూశాడు. రాజు వారిని విషయం చెప్పమన్నట్టుగా సైగ చేశాడు.

మంత్రి ప్రచండుడు వారిని ఉద్దేశించి, "మా వద్ద మీ మారువేషం అవసరం లేదు. నిజరూపంతో మాట్లాడవచ్చు. మీరు ఏం చూశారో నిర్భయంగా చెప్పండి." అన్నాడు గంభీరంగా.

"మనకు కావలసినది వారు తీసుకువచ్చిన సమాచారం. వారి వేషం కాదు మంత్రీ!" అన్నాడు రాజగురువు వెంటనే.

వేగులలో ఒకడు ముందుకు వచ్చి "మంత్రివర్యా! క్షమించాలి. మారునామం, మారువేషం మా వృత్తి ధర్మం కదా! అందుకే మేము రోజుకొక వేషంలోనూ రోజుకొక పేరుతోనూ తిరుగుతూ ఉంటాము. మీ సౌలభ్యం కోసం మా నలుగురినీ అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి అనే పేర్లతో సంభోదించవచ్చును." అన్నాడు వినయంగా.

"ఇదీ బాగుంది. సరే కానీయండి. అసలు విషయం చెప్పండి." అన్నాడు మంత్రి చిన్నగా నవ్వుతూ.

మొదట కృత్తిక చెప్పడం ప్రారంభించాడు. "ప్రభూ! ఎప్పుడూ సుభిక్షంగా శాంతి భద్రతలతో ఉండే మన మాళవ రాజ్యంలో గత నెల రోజులుగా కొన్ని అరాచకాలు సంభవిస్తున్నాయి. ఎక్కడనుండి వస్తున్నారో తెలియదు. కొందరు అడివిదొంగల వలె, కొందరు యుద్ధవీరుల వలె, కొందరు దుండగుల వలె ఉంటున్నారు. రాజ్యం నలుమూలలలోనూ వివిధ ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. దారి దోపిడీలు చేయడం, రైతుల పంట పొలాలను నాశనం చేయడం, ధనవంతుల ఇళ్లను కొల్లగొట్టడం, అర్ధరాత్రి సమయంలో మన కావలి దుర్గాలపై దాడి చేయడం వంటి ఆకృత్యాలను చేస్తున్నారు. అందరూ ముఖాన్ని ముసుగులతో కప్పుకోవడం వల్ల వీరెవరి ఆనవాళ్లు ఎవరూ చెప్పలేకుండా ఉన్నారు ప్రభూ! మన సేనలు, భటులు ఎంత ప్రయత్నించినా ఇప్పటివరకు ఒక్కరు కూడా పట్టుబడలేదు. నిన్న సాయంత్రమే దక్షిణకోన వద్ద మళ్ళీ పెళ్లి బృందంవారిని దోచుకోబోయారు. అందుకే వెంటనే ఈ విషయాలన్నీ తమకు తెలియజేయడానికి రాజధానికి వచ్చాము ప్రభూ!" ఆగాడు కృత్తిక.

"చూడబోతే వీరు సంఘవిద్రోహక శక్తులుగా కనిపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలను కాపాడకపోతే ప్రజలలో అశాంతి బయలుదేరి విప్లవానికి దారితీస్తుంది. మనం ఏదో ఒకటి త్వరగా చేయాలి రాజా!" అన్నాడు ఆనందవర్ధనుడు తన అనుమానాన్ని వ్యక్తపరుస్తూ.

"ఆ దుండగుల ఉద్దేశమే అది. ఇందులో అనుమానం ఏముంది? శూరసేన ప్రభువు తర్వాత ఈ సింహాసనం అధిష్టించగల వారసుడు లేకపోవడం వల్ల చుట్టుపక్కల రాజ్యాల రాజుల కళ్లన్నీ ఈ సింహాసనం వైపే ఉన్నాయి. అదే ఇటువంటి దుస్థితికి కారణం కావచ్చు. మీరు త్వరగా మీకు ఆప్తులైన వారిలో సింహాసనానికి అర్హులైన ఉత్తరాధికారిని నిర్ణయించండి మహారాజా! అదే ఈ సమస్యకు వెంటనే చెప్పగల పరిష్కారం." అన్నాడు ప్రచండుడు రాజుతో.

"మీరిరువురి కన్నా నాకు ఆప్తులు ఇంకెవరు ఉన్నారు మంత్రీ! ముందు ఈ ఉపద్రవం నుండి బయటపడితే ఉత్తరాధికారిని తర్వాత వెతుక్కోవచ్చు. వారు చెప్పేది సాంతం విని మీ సలహా చెప్పండి." అన్నాడు శూరసేనుడు మంత్రిని సమాధానపరుస్తూ.

ఇంతలో అశ్విని ముందుకు వచ్చి "ఇక్కడితో మన సమస్య అయిపోలేదు ప్రభూ! చెప్పాల్సిన విషయం మరొకటి ఉంది. ఈ మధ్యకాలంలో ఈ దాడులు జరిగినప్పుడు ఎక్కడి నుంచో ఒక యువతీ మెరుపు వేగంతో వచ్చి ప్రజలను కాపాడుతోంది. ఆమె కూడా ముసుగు వేసుకొని ఉండడం, ఎక్కడ నుంచి వస్తుందీ, ఎటు పోతుందీ, ఏ ప్రాంతానికి చెందినదీ తెలియకపోవడం ఇంకా వింతగా ఉంది. ఆమెకు ప్రజలు 'సౌదామిని' అని పేరు పెట్టుకుని ఆమెను సాక్షాత్తు

కాళికామాత అవతారంగా భావిస్తున్నారు. నిన్న దక్షణకోనలో పెళ్ళివారితో కలసి మారువేషంలో ఉన్న నేను కూడా ఆమెను చూశాను.” వివరించాడు అశ్విని.

“అయితే ఆ దుండగుల కన్నా ముందు ఈ యువతి ఎవరో కనిపెట్టాల్సిన అవసరం ఉంది. అలా చేస్తే వారి గురించి మరిన్ని వివరాలు తెలుస్తాయి. అసలు వారు చేయబోయే దాడుల విషయం ఈ సౌదామినికి ముందుగా ఎలా తెలుస్తోంది? ఆమె కూడా ఆ ముసుగుముఠాలో భాగస్వామినా? మీరు ముందు ఎలాగైనా ఆమెను కనిపెట్టాలి. కావాలంటే భటులను సహాయం తీసుకెళ్లండి. ఒక ఆడపిల్లను బంధించడం ఎంతసేపు?” తీర్మానించాడు మంత్రి.

”అలాగే ప్రభూ! కానీ ఆ యువతి అడుగుజాడలు కనిపెట్టడం కూడా కష్టంగా ఉంది. నేను ఆమెను చంద్రపురిలో చూశాను. ముఖం ఎల్లప్పుడూ ముసుగుతో కప్పి ఉంటోంది. ఒక గుర్రంపై వస్తోంది. ఆమె నిజంగానే మెరుపుతీగ. శరవేగంతో ఎలా ప్రయాణిస్తోందో, ఎలా ఎటు మాయమవుతుందో తెలియటం లేదు. నిజంగానే ఆమెకు ఏవో అతీతశక్తులు, మాయలు తెలుసేమో అని అనుమానంగా ఉంది ప్రభూ!” కొంచెం తడబడుతూ చెప్పాడు భరణి.

“అమాయక ప్రజలు రకరకాలుగా మాట్లాడుతారు. వారు పెట్టిన పేరు విని మీరు కూడా ఆమెను దేవతను చేసేస్తున్నారే!” అన్నాడు రాజు వెటకారంగా.

“క్షమించండి మహారాజా! భరణి చెప్పేది నిజమే! దక్షణకోన వద్ద దారిదోపిడీలు ఈ నెలలో రెండు సార్లు జరిగాయి. రెండు సార్లూ సౌదామిని వచ్చి అడ్డగించింది. రెండు వారాల క్రితం మొదటి దాడి జరిగిన ద్వాదశి రోజు ఉదయం నేను ఆమెను దక్షణకోన వద్ద చూశాను. ఇవాళ భరణి చెప్పినదాని బట్టి చూస్తే తాను ఆ యువతిని చంద్రపురిలో చూసినది ఏకాదశి రోజు సాయంత్రం ప్రభూ!” క్షణకాలం ఆగాడు రోహిణి.

“అయితే?” అన్నాడు ప్రచండుడు కుతూహలంగా.

“చంద్రపురి గ్రామం మాళవ రాజ్యం ఉత్తర సరిహద్దులో ఉన్నది కదా ప్రభూ! ఒక్క రాత్రిలో మధ్యలోనున్న కొండలను దాటుతూ 130 కోసుల పైన ప్రయాణించి దక్షణకోనను చేరుకోవడం సాధారణ మానవమాత్రులకు సాధ్యమయ్యే విషయం కాదు కదా!” కాస్త సంకోచిస్తూనే తన అభిప్రాయాన్ని చెప్పాడు రోహిణి.

కాసేపు ఆ మందిరంలో కేవలం నిశ్శబ్దం మాత్రమే నెలకొంది. మారు పలుకలేదు మంత్రి. రాజగురువు దీర్ఘాలోచనలో పడ్డాడు.

శూరసేనుడు నిస్సహాయంగా నిట్టూర్చి “సరే వేగులారా! మీ అన్వేషణను యధావిధిగా మీరు కొనసాగించండి. మరలా త్వరలో మరిన్ని విషయాలతో వచ్చి నన్ను కలవండి.” అని చెప్పి వారిని పంపేశాడు.

వారు వెళ్ళిపోయాక శూరసేనుడు ఇద్దరి వంక చూస్తూ “ఒకేసారి మన రాజ్యంలో ఇన్ని వింతలు జరగడమేమిటి! కష్ట సమయాల్లో కాళికామాత వచ్చి ఆదుకుంటుందనే జానపదుల కథలను అడ్డుపెట్టుకొని ఈ సౌదామిని ఇదంతా

చేస్తోందా? లేక నిజంగానే ఆమె ప్రజలను కాపాడడానికి వచ్చిన దేవతాంశా? ఏమీ పాలు పోవడం లేదు!" అన్నాడు నిట్టూరుస్తూ.

ప్రచండుడు రాజగురువు వైపు చూస్తూ "అయినా.. ఒక సాధారణ యువతికి ఈ సంఘసేవ ఎందుకు ఆచార్యా? అసలు ఆమే ఈ ముఠాకు నాయకురాలంటారా? దీని వెనుక ఆమెకు ఏదైనా రాజ్యకాంక్ష ఉందంటారా?" అన్నాడు ఆనందవర్ధనుని ముఖకవళికలను గమనించే ప్రయత్నం చేస్తూ.

రాజగురువు చిన్నగా నవ్వి "ఏమో! ఏ ముసుగు వెనుక ఏ రాజ్యాకాంక్ష దాగి ఉందో ఎవరికి తెలుసు!" అన్నాడు నెమ్మదిగా. అంతరార్థం గ్రహించలేని శూరసేనుడు భారీగా నిట్టూర్చాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS